క్లుప్తంగా

దళితులపై కక్ష సాధింపు చర్యలు ఆపాలి


ఉచ్చుల స్టాలిన్

యలమంచిలి: తెలుగు దేశం ప్రభుత్వం దళితులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజక వర్గ జేసీఎస్ బూత్ ఇన్చార్జి ఉచ్చుల స్టాలిన్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వంలో నరసాపురం ఎంపీగా ఉన్న రఘురామకృష్ణంరాజును అరెస్ట్ చేయడం అనేది దళిత ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్ విధుల్లో భాగమని పేర్కొన్నారు. ఇప్పుడు ఆయనపై కేసు పెట్టి ఏ-1గా చేర్చడాన్ని స్టాలిన్ ఖండించారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఈ విధంగా న్యాయబద్ధంగా పనిచేసే అధికారులపై తప్పుడు కేసులు బనాయించడం అప్రజాస్వామికమని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఇప్పుడు కేసు నమోదు చేయడం సమంజసం కాదని, సీఎం చంద్రబాబు ప్రభుత్వం ఇటువంటి కక్ష సాధింపు చర్యలు మానుకోపోతే సమయం వచ్చినపుడు ప్రజలే బుద్ధి చెప్తారని స్టాలిన్ హెచ్చరించారు.

రిజర్వేషన్లపై విధాన ప్రకటన చేయాలి


ముద్దాడ గణేష్ భవాని

పాలకొల్లు అర్బన్: వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్‌లు అమలుపై పార్లమెంట్‌లో ప్రధాని మోదీ విధాన ప్రకటన చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు ముద్దాడ గణేష్ భవాని డిమాండ్ చేశారు. శనివారం ఆయన పాలకొల్లులో విలేకరులతో మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జాతి గణన, కులగణన, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయకుండా, జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచకుండా బీసీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. దేశ వ్యాప్తంగా సమగ్ర కుల గణన చేపట్టి బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు పెంచాలని గణేష్ భవాని డిమాండ్ చేశారు. బీసీల రిజర్వేషన్ల సాధించడం కోసం రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో దేశ వ్యాప్త ఉద్యమాన్ని చేపడతామని ఆయన వెల్లడించారు.

ఇలపర్రు వీఆర్ఏ మృతి


యార్లగడ్డ యోసేబు

పెనుగొండ: మండలంలోని ఇలపర్రు వీఆర్ఏ యార్లగడ్డ యోసేబు(60) అనారోగ్యంతో శనివారం ఉదయం మృతి చెందారు. యోసేబుకు భార్య, కూతురు, నలుగురు కుమారులు ఉన్నారు. ఆర్ఐ ఎల్.కిరణ్, వీఆర్వోలు అనంతలక్ష్మి, బాలాజీ, వీఆర్ఏల సంఘ జిల్లా అధ్యక్షుడు బుంగా గణేష్, మండల అధ్యక్షుడు వి.పాపారావు తదితరులు యోసేబు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మవారికి నర్సాపురానికి చెందిన కె.సత్యనారాయణ, కాంచన దంపతులు 8 గ్రాముల బంగారం సమర్పించుకున్నారు. వారికి ఆలయ సిబ్బంది అమ్మవారి ప్రసాదం, రసీదును అందజేశారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

నారుమడుల్లో నీటిని తొలగించాలి


తాడేరులో రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ నిమ్మల శ్రీనివాస్

భీమవరం అర్బన్: నారుమడులలో వర్షపు నీటిని బయటకు తొలగించాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ రైతులకు సూచించారు. భీమవరం మండలం తాడేరు, బేతపూడి, రాయలం, గునుపూడి గ్రామాల్లో నారుమడులను శనివారం ఆయన పరిశీలించారు. ప్రస్తుత వర్షాలకు నారుమడుల చుట్టూ గట్లు ఎత్తుగా ఉండేటట్లు చేయాలన్నారు. మడుల్లో వర్షపు నీటిని తొలగించి, నారుపై రెండు గ్రాముల కార్బన్‌డిజం లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

అమ్మవార్లకు ఆషాఢ మాస సారె సమర్పణ

కాళ్ల: ఏలూరుపాడు గ్రామంలో కొలువు తీరి ఉన్న అమ్మవార్లకు ఆషాడ మాసం సారె సమర్పణ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.గ్రామ దేవతలైన పోలేరమ్మ, కొండాలమ్మ మహాలక్ష్మమ్మ,పుంతలో ముసలమ్మ, ఎల్లమ్మ ,కనక దుర్గాదేవి అమ్మవార్లకు శనివారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని గ్రామదేవతలకు ఆషాఢమాస సారె బిందులతో గ్రామంలో పురవీధుల మీదుగా మహిళలు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. పసుపు,కుంకుమ,చీర జాకెట్ ,గాజులు,పూలు,పళ్లతో పాటు 300 కేజీల స్వీట్లు గ్రామ మహిళా భక్తులు గ్రామ దేవతలకు సమర్పించారు.

వర్షం తెచ్చిన తంట

- నరసాపురం, మొగల్తూరు మండలాల్లో భారీ వర్షం
- ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీరు
- పలు గ్రామాల్లో నారుమడుల మునక

మొగల్తూరు: మొగల్తూరు మండలంలో గత రెండు రోజులుగా భారీ వర్షం కురుస్తుంది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు 19.2 మిల్లీ మీటర్లు, శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు 49.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దీంతో మండలంలోని పలుగ్రామాల్లోని పల్లపు ప్రాంతాలలో వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మొగల్తూరులోని గొల్లగూడెం, స్టేషన్ రోడ్, కోటరోడ్డు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేరహదారితో పాటు పంచాయతీ ఆవరణలో, ఉన్నత పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలిచిపోయింది. మండలంలోని కాళీపట్నం పడమర గ్రామంలోని గాంధీ బొమ్మల సెంటర్ ప్రాంతంలోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో పాటు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరింది. మరోవైపు గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మొగల్తూరులోని పడమటిపాలెం, రామన్నపాలెం గ్రామంలోని అడవిపర్ర ప్రాంతాలలో నారుమడులు మునిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


మొగల్తూరు పంచాయతీ పడమటిపాలెంలో మునిగిన నారుమడి

నరసాపురంలో

నరసాపురం: నరసాపురంలో శనివారం 64.6 మీమీ వర్షపాతం నమోదైంది. గత వారం రోజులుగా స్వల్ప స్థాయి నుంచి ఓ మోస్తరు వర్షం పడుతోంది. మధ్యలో బుధ, గురువారాల్లో వర్షం తగ్గి ఎండకాసింది. మళ్లీ శుక్రవారం రాత్రి నుంచి వాతావరణంలో మార్పు మొదలైంది. ముసురుపట్టి వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల కారణంగా ఫుట్‌పాత్ వ్యాపారులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.


మొగల్తూరు పంచాయతీ కార్యాలయ ఆవరణలో చేరిన వర్షపు నీరు


కాళీపట్నం పడమరలో ఇళ్ల మధ్యలో నిలిచిన వర్షపు నీరు


కాళీపట్నం పడమరలో ఇంట్లోకి చేరిన వర్షపు నీరు

వంతెన మార్గం ప్రమాదకరం

నరసాపురం: పట్టణంలోని రుస్తుంబాదలో మంగళగుంటపాలేనికి వెళ్లే వంతెన మార్గం ప్రమాదకరంగా ఉంది. దీంతో అటుగా వెళ్లేవారు ఆందోళనకు గురవుతున్నారు. వంతెన ఎక్కే మార్గంలో రెండు వైపు ఆలా కూడా రాళ్లు పైకి లేచిపోయాయి. అలాగే వంతెన రోడ్డు కూడా శిథిలమైంది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సైకిళ్లపై వెళ్లే స్కూల్ విద్యార్థులు ప్రతిరోజూ పడిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఎంతోకాలంగా ఈ వంతెన మార్గంవైపు రోడ్డుకు మరమ్మతులు చేయడంలేదు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని పరిస్థితిని చక్కదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

మనస్థాపంతో వ్యక్తి మృతి

ఉండి: భార్యపై మనస్థాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి గ్రామానికి చెందిన సనకం నర్సింహస్వామి (48) తన భార్యతో మనస్పర్థల కారణంగా ఈ నెల 8వ తేదీ సోమవారం పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబీకులు అతడిని భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. శనివారం ఉదయం 5 గంటల సమయంలో పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ నర్సింహస్వామి మృతి చెందాడు. దీనిపై అతని కుమారుడు శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ యెషయా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

ఉండి: వ్యక్తి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిక్కాల నరేష్ ఈ నెల 1న గల్ఫ్ దేశం మస్కట్ నుంచి ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలో ఉంటున్న తన చిన్నమ్మ అలుగు విమల ఇంటికి వచ్చాడు. అనంతరం తన భార్యతో మనస్పర్థల కారణంగా ఈ నెల 6వ తేదీ శనివారం ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. ఎంతకూ ఆచూకీ లభించకపోవడంతో విమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యాధులకు చెక్ పెట్టాలి

ఆకివీడు: సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టే విధంగా ప్రజలు అప్రమత్తతతో ఉండాలని పెదకాపవరం పీహెచ్‌సీ వైద్యురాలు బి.గోవర్ధిని విజ్ఞప్తి చేశారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా శనివారం అయిభీమవరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో వస్తున్న అంటువ్యాధులపై జాగ్రత్తలు పాటించాలన్నారు. ఓఆర్ఎస్, జింక్ మాత్రలు ఉపయోగించాలని సూచించారు.

రేపు చాంబర్స్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని భూపతిరాజు రామచంద్రరాజు అండ్ గోపాలకృష్ణంరాజు ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో సోమవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా. డి వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్వెన్కోటెక్, ఇన్ఫోల్యూమి, హప్‌టెక్ కంపెనీల్లో ఉద్యోగాల నిమిత్తం 2022, 2023, 2024(ప్రస్తుత ఫైనలియర్ విద్యార్థులు) సంవత్సరాల్లో ఏదైనా డిగ్రీ, డిగ్రీ (కంప్యూటర్), పీజీ(ఎంసీఏ), బీటెక్, బీఈ చేసిన విద్యార్థులు అర్హులని ఏర్కొన్నారు. అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు రెండు పాస్ పోర్టు సైజ్ ఫోటోలతో ఇంటర్వ్యూకి హాజరుకావాలని ప్రిన్సిపాల్ కోరారు. ఇతర వివరాలకు 99120 46234 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

వెంకన్న ఆలయాల్లో భక్తుల రద్దీ

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి గ్రామం కాపులకొడపలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామి వారికి ఏడు వారాల ప్రదిక్షణలు చేయడం, మొక్కుబడులు చెల్లించి, తలనీలాలను సమర్పించే భక్తుల సంఖ్య పెరగడంతో ప్రధాన రహదారి మొత్తం మధ్యాహ్నం వరకూ భక్తులతో కిక్కిరిసి ఉంది. ఈ సందర్భంగా స్వామివారిని తులసిదళాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం భక్తులను ఆకట్టుకుంది. సుమారు వెయ్యి మందిపైగా భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

సిద్ధాంతంలో..

పెనుగొండ: వశిష్ఠా గోదావరి తీరంలోని శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఏడువారాల స్వామిగా పేరుగాంచడంతో ఇటీవల కాలంలో భక్తుల తాకిడి ఎక్కువైంది. దీనిలో భాగంగా శనివారం తెల్లవారుజాము నుంచి కేదారీఘాట్‌లో పుష్కర్ ఘాట్‌లో భక్తులు స్నానమాచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద దీపాలు పెట్టారు. వారంవారం పెరుగుతున్న భక్తుల సంఖ్యతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.


ప్రత్యేకాలంకరణలో వేములదీవి వేంకటేశ్వరస్వామి


సిద్ధాంతంలో వేంకటేశ్వర స్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు

మొగల్తూరు: మండలంలోని మోళ్లపర్రు కనకదుర్గ బీచ్‌లల్లున్న దశావతార సహిత మత్స్యనారాయణ స్వామి, అష్టలక్ష్మీ సమేత ఆదిలక్ష్మి అమ్మవార్ల ఆలయంలో శనివారం వేకువజాము నుంచి వారాహి అవతారంలో ఉన్న అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రవీణ్ కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారి సన్నిధిలో నక్షత్ర దోషాలు, కార్యసిద్ధి దుష్టగహ నివారణకు పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి నిర్వహించిన విశేషార్చనలో పాలకొల్లుకు చెందిన ఉనికిల దక్షిణామూర్తి, మద్దాల భానుమూర్తి, అద్దాల వెంకట సత్యనారాయణ, తోట పాలాక్షుడు, కోయ జ్యోతి వీరరామ తులసి, వట్లిపులుసు వెంకటరమణ, జున్నూరు శ్యామల తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలో తీర ప్రాంత గ్రామాల భక్తులు సుమారు 400 మంది అమ్మవారి ప్రసాదాలు స్వీకరించారు.


వారాహి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు అవసరం

పెనుగొండ: వాతావరణ మార్పులుతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని మార్టేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ షేక్ షఫీద్ అన్నారు. శనివారం పెనుగొండలో జ్వరాలపై ఇంటింటి సర్వే నిర్వహించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. మురుగునీరు ఇంటి బయట నిలువకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా వర్షపు నీరు నిలిచిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జ్వరం వస్తే సత్వరం వైద్యుని సంప్రదించాలని పేర్కొన్నారు. కొబ్బరి డొక్కలు, పాత టైర్లు ఇళ్ల వద్ద ఉంటే దోమలు వ్యాప్తి చేందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ అద్దాల ఉమామహేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


పెనుగొండలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

భీమవరం: సైబర్ నేరాల పట్ల ప్రజలు అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని భీమవరం టూటౌన్ సీఐ జి.శ్రీనివాస్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన అవసరమంటూ ఏర్పాటు చేసిన బ్యానర్లను శనివారం ఆయన విడుదల చేసి మాట్లాడారు. ప్రజలు తమ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని, ఫోన్‌లో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్ డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు ట్రోల్ ఫ్రీ నంబర్ 1930కు డయల్ చేయాలని అన్నారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి, ఆర్ఆర్‌డీఎస్ కళాశాల అధ్యాపకుడు పి.అమూల్యరావు, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ మాట్లాడుతూ ఇటీవల కాలంలో మహిళలు, పిల్లలను టార్గెట్ చేసుకుని సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, ఇంటర్నెట్‌ను పరిమితికి మించి వాడకూడదని అన్నారు. సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే ఫిర్యాదు చేస్తే సొమ్ములు రికవరీ చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. సైబర్ క్రైమ్ సంబంధించి అవగాహన కల్పించడానికి ప్రతి కూడాలిలో బ్యానర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.


సైబర్ నేరాలపై అవగాహన బ్యానర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

రక్తదానం ఆరోగ్యానికి మేలు

ఆకివీడు: రక్తదానం చేయడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని వైద్యులు ఎండీ. బిలాల్ చెప్పారు. స్థానిక జమాతే ఇస్లామి హింద్ ఆకివీడు శాఖ ఆధ్వర్యంలో శనివారం షాదీఖానాలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ రక్తాన్ని దానం చేయడం ద్వారా కొంత మంది ప్రాణాల్ని కాపాడవచ్చునన్నారు. రక్తం అత్యవసరమైన వారికి ఆయా గ్రూపు రక్తం ఎక్కించి ప్రాణాలు నిలుపుతున్న ఘటనలు అనేకం ఉన్నాయని చెప్పారు. రక్తదానంతో దేహంలో కొత్త రక్తం పుట్టుకు వస్తుందని చెప్పారు. శిబిరంలో 62 మంది యువకులు తమ రక్తాన్ని దానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇస్లామి హింద్ ఆకివీడు శాఖ అధ్యక్షుడు ఎస్‌డీ. ఫారూక్, డాక్టర్ ఏఎస్ఎస్.రాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎండీ.మస్తాన్‌వలీ, ఎండీ.జిక్కీ అహ్మద్, లయన్స్ అహ్మద్, షహజాద్, మహబూబ్ జానీ, ఆరిఫ్, అతిఫ్, షబ్బీర్, అంజాద్ పాల్గొన్నారు.


షాదీఖానాలో రక్తదాన శిబిరంలో పాల్గొన్న స్థానికులు

పెరటి మొక్కలతో ఆదాయం, ఆరోగ్యం

పాలకొల్లు అర్బన్: ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో గానీ, డాబాలపైన గానీ పెరటి మొక్కలను పెంచడం వల్ల ఆదాయంతో పాటు ఆరోగ్యం సమకూర్చుకోవచ్చని ప్రముఖ పర్యావరణ వేత్త ముత్యాల సత్తిరాజు అన్నారు. పాలకొల్లు రేపాక వారి సత్రంలో ప్రకృతి నేస్తం గ్రూపు నిర్వాహకురాలు కంభంపాటి ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సత్తిరాజు ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. క్రిమి సంహారక ఎరువులు వినియోగించకుండా సేంద్రియ పద్ధతుల ద్వారా పెరటి మొక్కలను పెంచడం ద్వారా మన ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు ఇది ఎంతో దోహద పడుతుందన్నారు. ఈ సందర్భంగా మహిళలకు పూలమొక్కలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆనందబాబు, పి.లక్ష్మణరావు, సత్రం చైర్మన్ రేపాక శ్రీనివాసరావు, ట్రస్టీలు పెండ్యాల భవాని తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రి ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ దుర్గామల్లేశ్వరి, డాక్టర్ గిరీష్‌లు ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించి 50 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు.



పాలకొల్లు రేపాకవారి సత్రంలో ప్రకృతి నేస్తం సమావేశంలో పాల్గొన్న పర్యావరణ ప్రేమికులు

మహిళలు స్వయం శక్తితో ఎదగాలి

నరసాపురం: మహిళలు స్వయం శక్తితో వృద్ధిలోకి రావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. మొగల్తూరురోడ్డులో డ్వాక్రా మహిళలు నడుపుతున్న మహిళా మార్ట్‌ను శనివారం ఆమె ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌తో కలసి సందర్శించారు. మహిళా మార్ట్‌లో రోజువారీ జరుగుతున్న వ్యాపారం, టర్నోవర్ తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే నాయకర్ మాట్లాడుతూ మహిళా మార్ట్ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. నరసాపురం ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్ తదితరులు పాల్గొన్నారు.


మహిళా మార్ట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే నాయకర్

శివారు భూములకు నీరందిస్తాం

నరసాపురం రూరల్: మండలంలోని రుస్తుంబాద, సీతారామపురం గ్రామాల్లోని డ్రెయిన్లలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూడు తొలగింపు పనులకు స్థానిక శాసన సభ్యుడు బొమ్మిడి నాయకర్ ప్రారంభించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పంట కాలువలను, డ్రెయిన్లను శుభ్రపరచి శివారు భూములకు సైతం సాగునీరు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, కలవకొలను తాతాజీ, ఆకన చంద్రశేఖర్, కొప్పాడ రవీంద్ర, వాతాడి ఉమ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

భీమవరం: మానవత సేవా సంస్థ భీమవరం మండల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో శనివారం హెచ్ఐవీ బాధిత కుటుంబాల పిల్లలకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. వీరికి ప్రభుత్వం ఉచితంగా మందులు అందిస్తున్నప్పటికీ స్వచ్ఛంద సంస్థలు, దాతలు పౌష్టికాహారం అందించడం వల్ల రోగనిరోధకశక్తి పెరిగి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని సంస్థ అధ్యక్షుడు పెన్మెత్స రామ్మోహనవర్మ, డాక్టర్ ఎం గోవిందబాబు అన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక సాయం అందించిన సంస్థ కార్యదర్శి వేమూరి రాంబాబుకు అభినందనలు తెలిపారు.

పౌరుల హక్కులను హరించే విధంగా కొత్త క్రిమినల్ చట్టాలు



సమావేశంలో మాట్లాడుతున్న మునిస్వామి

తణుకు అర్బన్: భారత రాజ్యాంగం పౌరులకు ప్రాథమిక హక్కులతో పాటు స్వేచ్ఛ, సమానత్వం కల్పించిందని, ఆ హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం కొత్త క్రిమినల్ చట్టాలను రూపొందించిందని ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి విమర్శించారు. తణుకు బార్ అసోసియేషన్ హాల్‌లో శనివారం జిల్లా అధ్యక్షుడు ఎస్ఎస్ జాజువుద్దీన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాన్ని విమర్శిస్తే దేశం ద్రోహంగా పరిగణించి క్రిమినల్ కేసును నమోదు చేసే కొత్త క్రిమినల్ చట్టాలను వెంటనే నిలుపుదల చేయాలని, రానున్న రోజుల్లో కొత్త క్రిమినల్ చట్టాలకు వ్యతిరేకంగా ఉభయగోదావరి జిల్లాలో సదస్సులు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. చట్టాలను ఆమోదించే క్రమంలో ముందుగా న్యాయవాదులతో ఎటువంటి చర్చలు నిర్వహించకుండా ఏకపక్షంగా కొత్త చీకటి క్రిమినల్ చట్టాలను ఆమోదించారని విమర్శించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కొండ శ్రీనివాసరావు, కోశాధికారి పి.వేణుగోపాలచౌదరి, జిల్లా కమిటీ సభ్యులు పీవీపీ లక్ష్మి, గెద్దాడ విజయభాస్కర్, పి.వెంకట్, పి.రాజారావు, డి.అప్పారావు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, పాలకొల్లు వారు నాకిచ్చిన సంజాయిషీ ప్రకారం తెలియజేయునది ఏమనగా ఈ క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తిని శ్రీ మంతెన సత్రాజు తండ్రి రామరాజు మార్టుగేజ్ చేయడానికి అంగీకరించారు. సదరు ఆస్తిపై ఏ విధమైన అభ్యంతరములు ఉన్నా ఈ ప్రకటన వెలువడిన వారం రోజులలో తెలియజేయవలెను. తరువాత వచ్చిన అభ్యంతరములు స్వీకరించబడవు. ఉండి సబ్ రిజిస్ట్రార్ డాక్యుమెంట్ నం.1092/2021.ఉండి మండలం వెంద్ర గ్రామానికి చెందిన ఆర్.యస్.నం.175/10బి లో 195-5-00 చ.గ. స్థలానికి హద్దులు తూర్పు : రోడ్డు, పడమర : బుద్ధరాజు లక్ష్మీపతి రాజు స్థలం ఉత్తరం : బుద్ధరాజు సీతారామాంజనేయ రాజు స్థలం , దక్షిణం : బుద్ధరాజు బ్రహ్మరాజు స్థలం

పి.డి.యస్.వి.బాలాజీ, బి.కాం.,బి.ఎల్.
అడ్వకేటు,పాలకొల్లు,సెల్ : 94904 33732

ప్రకటన

నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, పాలకొల్లు వారు నాకిచ్చిన సంజాయిషీ ప్రకారం తెలియజేయునది ఏమనగా ఈ క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తిని శ్రీ తలకాయల శేఖర్ తండ్రి మంగన్న మార్టుగేజ్ చేయడానికి అంగీకరించారు. సదరు ఆస్తిపై ఏ విధమైన అభ్యంతరములు ఉన్నా ఈ ప్రకటన వెలువడిన వారం రోజులలో తెలియజేయవలెను. తరువాత వచ్చిన అభ్యంతరములు స్వీకరించబడవు. భీమవరం సబ్ రిజిస్ట్రార్ డాక్యుమెంట్ నం.820/2010.భీమవరం మండలం నరసింహాపురం గ్రామానికి చెందిన ఆర్.యస్.నం .15/2 లో 3 సెంట్లు స్థలానికి హద్దులు తూర్పు : మీరా పుల్లయ్య ఇల్లు, పడమర : తలకాయల నరసింహామూర్తి ఇల్లు ఉత్తరం : పంట కాల్వ దక్షిణం : రోడ్డు

పి.డి.యస్.వి.బాలాజీ, బి.కాం.,బి.ఎల్.
అడ్వకేటు,పాలకొల్లు,సెల్ : 94904 33732

